
మడపాం టోల్‌గేట్ వద్ద సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చూసేందుకు ఎగబడుతున్న వైఎస్సార్‌సీపీ అభిమానులు

జననేతకు నీరాజనం


మడపాం వద్ద వైఎస్సార్‌సీపీ జెండాలతో జగన్‌కు స్వాగతం పలుకుతున్న యువత


ఆమదాలవలస: కొత్తరోడ్డు (తోటాడ) జంక్షన్ వద్ద సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు వచ్చిన ఆమదాలవలస నియోజకవర్గ ప్రజలు


ప్రత్యేకంగా కుట్టించిన దుస్తులతో జగన్ అభిమాని మడపతి తేజేస్‌కుమార్

- ఘన స్వాగతం పలికిన నరసన్నపేట, ఆమదాలవలస నియోజకవర్గ ప్రజలు
- మండుటెండలోనూ ఎదురుచూసిన కార్యకర్తలు, అభిమానులు
- పెద్దఎత్తున హాజరైన మహిళలు

నరసన్నపేట/పోలాకి/జలుమూరు/సారవకోట: మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా నరసన్నపేట నియోజకవర్గ ముఖ కేంద్రం మడపాం వద్ద సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. ఉదయం 10 గంటలకు మడపాం టోల్‌గేట్ వద్దకు మహిళలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఎండను లెక్క చేయకుండా అభిమాన నేత జగనన్న కోసం నిరీక్షించారు. 12 గంటలకు మడపాం టోల్‌గేట్ వద్దకు బస్సు యాత్ర చేరుకోవడంతో జై జగన్ అంటూ నినాదాలు మిన్నంటాయి. బస్సులో ఉన్న ముఖ్యమంత్రిని చూసేందుకు పోటీపడ్డారు. కార్యకర్తల ఉత్సాహాన్ని గమనించిన జగనన్న బస్సును ఆపి బయటకు వచ్చి అభిమానులకు అభివాదం చేశారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని వినతులు స్వీకరించారు. రాష్ట్ర పొందర, కూరాకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ రాజాపు హైమావతి, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ముద్దాడ భైరాగినాయుడు, నరసన్నపేట వైస్ ఎంపీపీ పాగోటి జయలక్ష్మి, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పాట్నూరు సాయిప్రసాద్, నరసన్నపేట సర్పంచ్ బురెల్లి శంకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కోరాడ చంద్రభూషణగుప్త, రెంటికోట త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం కోసం వినతి..

వంశధార నదిపై మడపాం వద్ద ఎత్తిపోతల పథకం నిర్మించాలని పోతయ్యవలస, మడపాం, గోపాలపెంట, గ్రామాలకు చెందిన రైతులు సీఎం జగన్‌కు విజ్ఞప్తి చేశారు. కోమర్తి నీటి సంఘం మాజీ అధ్యక్షుడు కనపల శేఖరరావు వినతిపత్రాన్ని సీఎంకు అందజేశారు. ఇటీవల నరసన్నపేటకు వచ్చినప్పుడు ఎత్తిపోతల పథకం మంజూరుకు నిధులు కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తయితే వెయ్యి ఎకరాలకు సాగునీటి సమస్య తీరుతుందని సీఎంకు వివరించారు.

సీఎం మాస్క్‌లతో ఆకట్టుకున్న బాలికలు

ముఖ్యమంత్రి జగన్ మామను చూసేందుకు మండలంలోని గోపాలపెంటకు చెందిన అక్కాచెల్లెల్లు అక్షర, చెర్రిలు సీఎం జగన్ మాస్క్‌లు పెట్టుకుని ఆకట్టుకున్నారు. వారి తల్లిదండ్రులతో కలిసి మడపాం టోల్‌గేట్ వద్దకు వచ్చారు.

ఆనందంలో చిన్నబమ్మిడి వాసులు..

బస్సు యాత్రలో భాగంగా తమ గ్రామం మీదుగా టెక్కలి వెళ్తున్నట్లు తెలుసుకున్న కోటబొమ్మాళి మండలం చిన్నబమ్మిడి, నిమ్మాడ జంక్షన్, వాంద్రాడ, సుబ్బారావుపేట, పెద్దబమ్మిడి గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ అభిమానులు చిన్నబమ్మిడి కూడలి వద్ద జగనన్నను చూడగానే ఆనందం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీటీసీ వాన లక్ష్మి ఆధ్వర్యంలో అక్కడకు చేరుకున్న పార్టీ శ్రేణులు సీఎంకు జేజేలు పలికారు.

కార్యకర్తల్లో జోష్

ఆమదాలవలస: మండలంలోని తోటాడ జంక్షన్ వద్ద (హైవే రోడ్డుపై) సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆమదావలస నియోజకవర్గ క్యాడర్, కార్యకర్తలు, పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు, అభిమానులు కలుసుకున్నారు. మళ్లీ సీఎంగా ఆమదాలవలస రావాలిని నినాదాలు చేస్తూ స్వాగతం పలికారు. కొంతమంది సీఎం జగన్ ఫొటోలను ఆర్ట్స్ వేసి ఆయనకి అందించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, ఆమదాలవలస మండలం, మున్సిపాలిటీ, సరుబుజ్జలి, బూర్జ, పొందూరు మండలాలకు చెందిన పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


మడపాం టోల్‌గేట్ వద్ద సీఎం రాకకోసం ఎదురుచూస్తున్న నాయకులు, అభిమానులు


టోల్‌గేట్ వద్దకు తరలివచ్చిన మహిళలు


జగనన్న మాస్క్‌లతో గోపాలపెంటకు చెందిన బాలికలు

దారులన్నీ టెక్కలి వైపే..


పాతపట్నం: పాతపట్నం నుంచి తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలు


నరసన్నపేట: నరన్నపేట నుంచి సభకు బయలుదేరిన పార్టీ శ్రేణులు

టెక్కలి సమీపంలోని అక్కవరంలో బుధవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన బస్సు యాత్ర ముగింపు సభకు నరసన్నపేట, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవరాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివెళ్లాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా తరలివెళ్లారు.

– సాక్షి నెట్‌వర్క్


ఎల్.ఎన్.పేట: బస్సులో తరలివెళ్తున్న నాయకులు

క్లుప్తంగా

నేడు ధర్మాన కృష్ణదాస్ నామినేషన్

నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్ గురువారం నామినేషన్ వేయనున్నారు. ఈ మేరకు పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు, బీసీ సెల్ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి ధర్మాన కృష్ణచైతన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి ర్యాలీ ఉంటుందన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు నరసన్నపేటలోని పైడితల్లి ఆలయం వద్దకు చేరుకోవాలని కోరారు. మబగాం నుంచి ర్యాలీ ఉంటుందన్నారు.

వంట గది ప్రారంభం


ఆలయ ఆవరణలో నిర్మించిన వంటగది

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి చింతాడ గ్రామం సమీపంలో కొండపై గల ఉమారామ లింగేశ్వరస్వామి ఆలయం ఆవరణలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన వంటగదిని దాతలు, భక్తులు ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. ఆమదాలవలస మండలం కనుగులవలస గ్రామానికి చెందిన భక్తులు నూక వెంకటరావు, రమణమ్మ దంపతులు ఈ మొత్తాన్ని వితరణగా అందించి నిర్మాణానికి సహకరించారని ఆలయ అర్చకులు శీల సూర్యనారాయణ తెలిపారు. వంట గది నిర్మాణానికి సహకరించిన వారికి భక్తులు అభినందించారు.

సరిహద్దులో ముమ్మర తనిఖీలు


పాతపట్నం చెక్ పోస్ట్ వద్ద కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

పాతపట్నం: ఆంధ్ర–ఒడిశా సరిహద్దులోని పాతపట్నం, మెళియాపుట్టి మండలంలోని వసుంధర చెక్ పోస్టు వద్ద ముమ్మరంగా వాహన తనిఖీలు చేపడుతున్నారు. పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సరిహద్దు చెక్ పోస్టులో బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారని, ఒక్కో చెక్ పోస్ట్ వద్ద ఒక ఎస్ఐతోపాటు నలుగురు కానిస్టేబుళ్లను నియమించామని సీఐ నల్లి సాయి తెలిపారు. ఒడిశా నుంచి వచ్చే వాహనాలు, ఆంధ్ర నుంచి వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు.